# హైటెక్ అమ్మాయి

కాలింగ్‌బెల్ మోగింది.

'పొద్దుటే ఎవరొచ్చి పడ్డార్రా దేవుడా!' విసుక్కుంటూ వెళ్ళి తలుపుతీసింది కామాక్షమ్మ.

గుమ్మం బయట ఓ ఇరవైఏళ్ల అపరిచిత అమ్మాయి నిలబడివుంది!

ప్రయాణం చేసొచ్చినందువల్ల కాబోలు అలసినట్టుంది.

ఆమె చేతిలోని సూట్‌కేసు చూసేసరికి కామాక్షమ్మ గుండె ఝల్లుమంది.

"ఎవరు కావాలీ?"

"మీరే... అనంతయ్యగారిల్లు ఇదే కదండీ"

"నువ్వెక్కడ్నుంచొచ్చావు?" ఎదురుప్రశ్న వేసింది.

"మాది నర్సాపురమండీ. నా పేరు ల...లావణ్య... సుబ్బారాయుడుగారు పంపించారు. నాకిక్కడ ఇంటర్వ్యూవుంది. తెలిసినవాళ్లు ఎవరూలేరు. అందుకని మీ ఇంట్లో వుండి..."

"రామ్మా రా. ఇది ఇల్లుకాదు సత్రంలే..." అంది కామాక్షమ్మ ముఖం చిట్లించి.

ఇబ్బందిగా ముఖం పెట్టి చూస్తూ ఇంట్లో అడుగుపెట్టింది లావణ్య.

"ఒరే అబ్బాయ్. లేవరా చుట్టాలొచ్చారు లేలే..." గదిలో నిద్రపోతున్న కొడుకుని లేపింది.

"ఉండమ్మా. ఇంత పొద్దున్నే లేపుతావేంటీ"

"అప్పుడే ఏడయ్యిందిరా. మనింటికి చుట్టాలమ్మాయి వచ్చింది లే మరి" అంటూ కప్పుకున్న దుప్పటి విసురుగా లాగేసింది.

అమ్మాయి అన్న పదం చెవిన పడటంతో గబుక్కున మంచంమీంచి లేచాడు. గబగబా తలదువ్వుకుని ముందు గదిలోకొచ్చాడు.

కుర్చీలో బెరుగ్గా కూర్చునుంది లావణ్య. ఆమెని చూడగానే మంచులో తడిసిన మల్లెమొగ్గ గుర్తొచ్చింది.

"హాయ్" అన్నాడు ఉత్సాహంగా.

"నాపేరు లావణ్య. నర్సాపురం నుంచి ఇంటర్వ్యూ కోసం ఇక్కడికి వచ్చాను." అంది.

"వెల్కమ్ టు హైటెక్‌సిటీ. నా పేరు భాస్కర్. బ్యాంక్‌లో పనిచేస్తున్నాను. ప్రయాణం వల్ల అలసినట్టున్నారు. నా రూమ్‌లోకెళ్ళి కాస్సేపు పడుకోండి మీ ఇల్లే అనుకుని ఫ్రీగా ఫీలవ్వండి."

"థాంక్యూ" అందామె.

గదిలోకెళ్ళింది. పుస్తకాలూ పేపర్లూ దుస్తులూ చెల్లాచెదురుగా పడివున్నాయి.

'అతడికి బద్ధకం ఎక్కువైనా అయ్యుండాలి, కళాదృష్టి తక్కువైనా అయ్యుండాలి' అనుకుంది.

మారు దుస్తులు తీసుకుని బాత్‌రూమ్‌లోకెళ్లి స్నానం పూర్తిచేసుకునొచ్చింది లావణ్య.

పక్కగదిలో నిద్రపోతున్న కూతుర్ని ఒక్కటేసి "లేవ్వే" అని కసిరింది కామాక్షమ్మ.

"ఎప్పుడూ శుభ్రంగా నిద్రపోనివ్వవుకదా" విసుక్కుంటూ లేచికూర్చుంది కూతురు.

"అర్ధరాత్రి దాకా టీవీ చూట్టం పొద్దెక్కేక లేవటమూనూ! ఒక పద్ధతీ పాడూ లేదుకదా! అత్తారింటి కెళ్ళాల్సినదానివన్న ఇంగితం కూడా లేదు"

"భారతం విప్పకు"

ఆవులిస్తూనే ముందుగదిలో కొచ్చి టీవీ ఆన్ చేసింది భారతి. లావణ్యని చూసి నవ్వింది.

"మిమ్మల్నెప్పుడూ చూళ్లేదు"

"సిటీకి రావడం ఇదే ఫస్ట్‌టైమ్" అంది లావణ్య.

ఇంతలో కాయగూరల సంచితో వచ్చారు అనంతయ్య.

"ఎవరీ అమ్మాయి లక్ష్మీదేవిలా వుంది" అనడిగారు లావణ్యని చూసి.

"నమస్కారమండీ. మాది నర్సాపురం సుబ్బారాయుడిగారి బంధువుని. ఇక్కడో ఇంటర్వ్యూవుంటేనూ..." చెప్పింది లావణ్య.

"అలాగా మా నర్సాపురం అమ్మాయివా. చాలా సంతోషం. మన ఊరెలావుంది?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించారాయన.

"కబుర్లు తర్వాత, ముందా కాయగూరలిలాపట్రండి" అంది కామాక్షమ్మ.

కూరల సంచి ఇచ్చి వచ్చారాయన.

"మేమూ నర్సాపురం రావాలనుకుంటున్నాం. వారం పదిరోజుల్లో వస్తాం" అన్నారాయన.

"ఏం పని మావయ్యగారూ"

ఆ పిలుపుకి ఉలిక్కిపడి చూశారు. అంతలోనే సర్దుకుని అన్నారు– "మా అబ్బాయికో పెళ్ళి సంబంధం వచ్చిందమ్మా. మీ సుబ్బారాయుడే తీసుకొచ్చాడు. మల్లవరం అనీ నీకు తెలిసేవుంటుంది. ఆ ఊరి సంబంధం. పెళ్ళిచూపుల కెళ్ళాలి"

"ఇక్కడెవరూ నచ్చక పల్లెటూరి మొద్దుని తీసుకొచ్చి మా అన్నయ్యకి కట్టబెడతార్ట!" చిన్నగా నవ్వుతూ అంది భారతి.

లావణ్య వదనం కొంచెంగా నల్లబడింది.

"అవేం మాటలే భారతీ. ఆ అమ్మాయి డిగ్రీ చదివింది కదా. మీరంతా ఏదో అనుకుంటారుగాని పల్లెటూరి వారికున్న అభిమానాలూ ఆప్యాయతలూ, అనుబంధాలూ ఆత్మీయతలూ పట్నాల్లో ఎక్కడ కన్పిస్తాయి చెప్పు. పక్క ఎపార్ట్‌మెంట్లో ఎవరుంటున్నారో కూడా పట్టించుకోరు!" అన్నారు అనంతయ్య.

"చదువులూ పత్రికలూ టీవీలూ వచ్చేక అన్నిచోట్లా నాగరికత బాగా పెరిగింది." లావణ్య అంది.

"బాగా చెప్పేవు. ఈ అమ్మాయిది నర్సాపురం. అదోచిన్న టౌను. అయితేనేం పొందికగానూ, మోడర్న్ గానూ లేదూ?!" మెచ్చుకున్నారాయన.

"ఇంకా అక్కడే తిష్ఠవేసేవేమే. త్వరగా తెములు, కాలేజీకి టైమవుతోంది." కామాక్షమ్మ అదిలింపుకి విసుక్కుంటూ లేచెళ్ళింది భారతి.

"ఇంటర్వ్యూ ఎక్కడ? ఎన్నింటికి?"

చెప్పింది లావణ్య.

"మా భాస్కర్ ఆఫీసుకి అటే వెళ్తాడు. దారిలో నిన్ను డ్రాప్ చేసి వెళ్లమంటాన్లే"

"ఎందుకులెండి బస్సులో వెళ్తాను"

"ఈ బస్సుల్ని నమ్ముకుంటే నువ్వు టైముకి వెళ్ళినట్టే!" అన్నారు అనంతయ్య.

"నాకు డ్రైవింగ్ చేయడం బాగానే వచ్చండోయ్ లావణ్యగారూ" వారి సంభాషణ మధ్యలో కల్పించుకుంటూ అన్నాడు భాస్కర్.

నవ్వేసింది లావణ్య.

బ్రేక్‌ఫాస్ట్ చేసి బయల్దేరారు.

భాస్కర్ స్కూటర్ వెనుక కూర్చోడానికి కించిత్తు మొహమాటపడింది లావణ్య. బుగ్గలు ఎరుపెక్కగా ముడుచుకుని ఒద్దికగా కూర్చుంది.

అతడు సడన్‌బ్రేక్‌వెయ్యడం లాంటివి చేస్తాడేమోనని భయపడింది గాని చాలా బుద్ధిగా జాగ్రత్తగా తీసుకెళ్లాడు. ఆల్‌దిబెస్ట్ చెప్పి వెళ్ళిపోయాడు.

మరి రెండు గంటలకి ఇంటికి తిరిగి వచ్చింది లావణ్య.

"ఇంటర్వ్యూ ఎలా చేశావమ్మా" లావణ్యని అడిగారు అనంతయ్య.

"బాగానే చేశాను మావయ్యగారూ. మీ ఇల్లు చిన్నదైనా బావుంది. స్వంతమేనాండీ"

"అవునమ్మా. నేనంటూ సంపాదించిన ఆస్తి ఇదొక్కటే. ఎప్పుడో ఇరవై ఏళ్లక్రితం గనుక ఇంతస్థలం కొని ఈ మాత్రపు ఇల్లు కట్టగలిగాను. ఇప్పుడీ ఏరియాలో గజం నాలుగువేల దాకా పలుకుతోందమ్మాయ్"

"చక్కని నిర్ణయం. ఇంచక్కని ఇన్వెస్ట్‌మెంట్. మీ ముందుచూపుకి జోహార్లు మావయ్యగారూ."

ఉబ్బితబ్బిబ్బయ్యారాయన.

అప్పట్లో భార్యపోరు పడలేక ఊరవతల స్థలం కొని చిన్న ఇల్లు కట్టేరు. అనుకోకుండా నగరం ఇబ్బడిముబ్బడిగా పెరగటంతో అది బిజీసెంటరైంది.!

"ఇంటి చుట్టూ చక్కని స్థలం వుంది. ఇంటి ముందు పూలమొక్కలు నాటితే చాలా బావుంటుంది. పెరట్లో కాయగూరలు పండించొచ్చు. రిటైరయ్యారు గనుక మీకూ కాలక్షేపంగా వుంటుంది. ఎక్సర్‌సైజు చేసినట్టూ వుంటుంది. ఇంటికి అందమూ వస్తుంది. అదనపు ఆదాయమూ చేకూరుతుంది."

బుర్ర గోక్కున్నారాయన.

"మా బాగా చెప్పేవు. నా ఆయుష్షు కూడా పోసుకుని నూరేళ్ళు చల్లగా వర్ధిల్లు. కూరల ఊసెత్తితే చాలు గుండెల్లో దడ పుట్టుకొస్తోంది. అంతగా పెరిగిపోయాయి ధరలు. అమ్మాయి చెప్పినట్టు చెయ్యండి" అంది కామాక్షమ్మ.

"చూద్దాం" అన్నారాయన.

"చూద్దాం కాదు మావయ్యగారూ, చేద్దాం చేస్తాం అనండి" అంది లావణ్య.

"ఘటికురాలివే" అంటూ నవ్వేశారాయన.

భాస్కర్ గదిని నీట్‌గా సర్దింది లావణ్య.

పిమ్మట కామాక్షమ్మతో కలిసి భోంచేస్తూ "భారతికి సంబంధాలు చూస్తున్నారా" అడిగింది.

"చెట్టంత ఎదిగి కూర్చుంది. చూడకపోతే ఎలా చెప్పు. దానికేమో గంపెడు కోర్కెలు. మంచం వున్నంతవరకే కాళ్ళు జాపుకోవాలంటే వినదు. గొప్ప గొప్ప సంబంధాలు కావాలంటే సంచుల్తో డబ్బు కుమ్మరించొద్దూ!"

"అవునవును. ఈ రోజుల్లో పెళ్లి అంటే మూడు ముళ్ళూ ఆరు అడుగులూ వేల లాంఛనలూ లక్షల కట్నాలూనూ!"

"బాగా చెప్పేవు. మా కాలంలో మరీ ఇంత దాహం వుండేదికాదు..." అనింకేదో అనబోయి వెంటనే కొడుకు పెళ్ళి సంగతి గుర్తొచ్చి మిన్నకుండిపోయింది కామాక్షమ్మ.

ఆ సంగతి ఇట్టే గ్రహించి లోలోపల నవ్వుకుంది లావణ్య.

సాయంత్రం భాస్కర్ వచ్చి తన గదిని చూసుకుని మురిసిపోయాడు. లావణ్య వంక అభినందిస్తూ చూశాడు.

"ఇంటర్వ్యూ ఎలా చేశారు?"

"ఇంటర్వ్యూ చేశానుగాని ఇంకా ఎవరెవరేవిటో పూర్తిగా తెలీలేదు"

"మీరు ఇంటర్వ్యూచేశారా? మిమ్మల్ని ఇంటర్వ్యూ చేశారా?" అయోమయంగా చూస్తూ అడిగాడు.

నవ్వేసింది. "భలే ప్రశ్నవేశారు. మనం వెళ్ళే చోటు ఎలా వుందో ఏవిటో మనకి అన్ని విధాలా బాగుంటుందో లేదో తెలుసుకోవద్దూ?!" అంది లావణ్య.

"ఆ రూట్లో వచ్చారా. దాంతోబాటు వేజ్ రివిజన్ గురించీ ప్రమోషన్ అవకాశాల గురించీ కూడా తెలుసుకోండి"

నవ్వేస్తూ "అలాగే" అంది.

"మీరేమీ అనుకోనంటే..." సంకోచిస్తూ ఆగాడు భాస్కర్.

"ఏమనుకోను చెప్పండి..."

"మీ సుబ్బారాయుడుగారు నాకో సంబంధం తీసుకొచ్చారు. లలిత అనీ... ఆమె మీకు తెలుసా?"

"బాగా తెలుసు"

అతడి ముఖం విప్పారింది.

"బాగుంటుందా? మీ అంతగాకపోయినా ఫర్లేదు"

"మేం ఇద్దరం కవలల్లా వుంటాం. నేను నచ్చితే తనూ నచ్చితీరుతుంది" కించిత్తు సిగ్గుపడుతూ అంది.

"మీలాగా అయితే ఇంకేం కళ్లు మూసుకుని తాళి కట్టేస్తాను" ఆనందంగా అన్నాడు భాస్కర్.

"కళ్లు తెరిచే కట్టొచ్చుగా"

లావణ్య మాటలకి నవ్వేశాడు.

"మీకు సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువేనే"

"మీరు బ్యాంకులో చేరి ఎన్నేళ్లయ్యింది? అందులోనే వుంటారా, మరి దేనికైనా ప్రయత్నిస్తున్నారా?"

"నాలుగేళ్లయ్యింది. సిఎఐఐబి పార్ట్ ఒన్ పాసయ్యాను. ఈసారి ఆఫీసర్ ప్రమోషన్ ఖాయం"

"మిగతా పార్టూ పూర్తిచెయ్యండి. విష్యూ గుడ్‌లక్"

రాత్రి భోజనాలయ్యాక అంతా టీవీ ముందు కూర్చున్నారు. "సంబంధం గురించి సుబ్బారాయుడేమైనా చెప్పేడా అమ్మాయ్"

"చెప్పేరు మావయ్యగారూ. కట్నం సొమ్మంతా రొక్కంగా కావాలంటున్నారని అమ్మాయి తరపువాళ్లు ఇదవుతున్నార్ట. మీకు తెలుసుకదా. పసుపుకుంకాలకింద కొంతభూమి రాసివ్వడం రైతువారీ కుటుంబాల్లోని పద్ధతి" అంది లావణ్య.

"మా అమ్మాయిలా కలిసిపోయావు గనుక చెబుతున్నాను. ఆ కట్నపుసొమ్ముతో భారతి పెళ్ళిచేయాలమ్మా. అందుకనే కేష్ అడుగుతున్నాం. పెళ్ళి ఎంత సింపుల్‌గా చేసినా మాకిష్టమే అంటున్నాం. మాకూ ఖర్చు మిగులుద్ది కదా" అన్నారాయన.

"అంతేకాదు. ఆ భూములు ఎంతరేటో ఏవిటో! రేపు అమ్ముకోవాలంటే ఏం ఇబ్బందులొచ్చి పడతాయో ఏమో ఎవరికి తెలుసు!" కామాక్షమ్మ అంది.

"మీరు చెప్పిందీ పాయింటే. మా ప్రాంతంలో పొలాల రేట్లు బాగా పెరిగాయిలెండి. వాళ్ళు కూడా అమ్మాయి పేరన అంతో ఇంతో వుండాలని ఆశిస్తారు కదా. వాళ్ళ దృష్టితో కూడా మనం ఆలోచించాలి మరి. ఎంత కట్నం తెచ్చినా ఎన్ని కానుకలు

తెచ్చినా ఇంకా చాల్లేదంటూ నూరేళ్లపంటని మూడేళ్లమంటగా మారుస్తున్న కాలం కదా ఇది!"

"అబ్బే. ఒకరి సొమ్ముతో సోకు చేసుకోవాలనుకునే బాపతు కాదు. ఏదో అమ్మాయి పెళ్ళి చెయ్యాలి గనుగ్గానీ లేకపోతే కేష్ కావాలని పట్టుబట్టే వాళ్లమే కాదు"

"అదీ నిజమేలెండి.." అంది లావణ్య.

"మనం పెళ్ళిచూపులకెప్పుడెళ్ళేదీ ముందుగా ఒక నిర్ణయానికొచ్చి వారికి కబురంపితే బావుంటుంది కదా" అన్నారు అనంతయ్య.

"రేపు మాట్లాడుకుందాంలెండి" అంది కామాక్షమ్మ.

అంతా లేచి నిద్రకుపక్రమించారు.

పడుకుందన్నమాటేగాని నిద్రరావట్లేదు లావణ్యకి.

ఇంట్లోనివారి మనస్తత్వాలని కొంతవరకూ అంచనావేస్తూ పైకి కన్పించని చీకటి కోణాలేమీ లేవుకదాని తర్కించుకోసాగింది.

"ఆ లావణ్య నాకు బాగా నచ్చిందండీ. ఆ అమ్మాయికి దగ్గరి సంబంధాలేం లేవుట. బయటి సంబంధాలు చూస్తున్నారుట" కామాక్షమ్మ భర్తతో లోగొంతుకతో అన్న మాటలు లావణ్య చెవినబడ్డాయి. చెవులు రిక్కించింది.

"నాకు కూడా బాగా నచ్చింది మరి. చక్కగా చలాకీగా వుంది. కానీ.."

"మన భాస్కర్‌కి చేస్తారేమో కనుక్కుంటే?" అంది కామాక్షమ్మ.

"ఒక సంబంధం కదిపేక... బాగోదేమోనే" అన్నారు అనంతయ్య.

"కదపటం వరకేగాని చూపులదాకా రాలేదుకదా. లలిత బదులు లావణ్య. అంతేకదా" అంది కామాక్షమ్మ.

"అవుననుకో. వీళ్ళు మనం కోరినంత కట్నం ఇవ్వగలరో లేదో మరి"

"కాసింత తక్కువైతే ఏం పోయింది లెద్దురూ పిల్ల బంగారం. రేపా సుబ్బారాయుడికి ఫోన్ చేసి కనుక్కోండి"

"అలాగేలే" అన్నారాయన.

సంతృప్తిగా సిగ్గుగా నవ్వుకుంది లావణ్య.

మర్నాడు లావణ్య తిరుగు ప్రయాణమవుతోంటే ఎంతో కావాల్సిన వారెవరో దూరమవుతున్నట్టుగా ఫీలయ్యారంతా.

టాటా చెప్పి ఆటో ఎక్కింది.

"మేం వారం పదిరోజుల్లో పెళ్ళి చూపులకి నర్సాపురం వస్తామని సుబ్బారాయుడికి చెప్పమ్మా. ఓ ముఖ్యవిషయం ఫోన్లో చెబుతానని కూడా చెప్పు"

"పెళ్ళి చూపులంటే అబ్బాయి అమ్మాయిని చూసి ఓకే చెయ్యడం కాదు. అమ్మాయి అబ్బాయి వాళ్ళిల్లు చూసి ఇంట్లో వాళ్లని చూసి ఓకే చెయ్యాలి. ఏవంటారు మామయ్యగారూ" అంది లావణ్య.

"అమ్మో-చాలా తెలివైందానివేనే"

"పెళ్ళి చూపులయ్యాయి కదా. ఏకంగా పెళ్ళికి తరలివద్దురుగాని మావయ్యగారూ"

"అదేవిటి?" బుర్రగోక్కున్నారు అనంతయ్య.

ఆటో కదుల్తోంటే అంది-

"నేను ఇంటర్వ్యూకి రాలేదు పెళ్ళిచూపులకొచ్చాను. నాపేరు లావణ్య కాదు లలిత!"

(స్వాతి సపరివార పత్రిక)

**16.4.1999**